క్లుప్తంగా

తంబళ్లపల్లె ఎమ్మెల్యే అయ్యప్ప దీక్ష

సదుం: తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి బుధవారం అయ్యప్ప దీక్ష స్వీకరించారు. ఎర్రాతివారిపల్లె కోటమల్లై అయ్యప్ప స్వామి ఆలయంలో మాలధారణ చేశారు.

ఆక్రమిత భూమి స్వాధీనం



సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

గుడుపల్లె : మండలంలోని గుండ్లసాగరంలో ఆక్రమణకు గురైన సింగిల్ విండో బ్యాంకుకు చెందిన భూమిని రెవెన్యూ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. 3 ఏళ్ల క్రితం జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు మల్టీ పర్పస్ బిల్డింగ్ నిర్మాణం కోసం 50 సెంట్లు కేటాయించారు. తర్వాత ఆ భూమిని సింగిల్ విండో బ్యాంకుకు అప్పగించారు. ఈక్రమంలో మిద్దూరుకు చెందిన ఓ వ్యక్తి సదరు భూమిని కబ్జా చేశారు. అందులో షెడ్లు నిర్మించి పశువులను కట్టేసుకున్నాడు. దీనిపై రెవెన్యూ అధికారులకు సింగిల్ విండో బ్యాంకు సీఈఓ దిలీప్‌కుమార్‌మూర్తి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రెవెన్యూ సిబ్బంది సర్వే చేసి భూమిని స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులకు అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

కుప్పం: ఆర్టీసీలోని ఆన్‌కాల్ డ్రైవర్లు, అద్దె బస్సు డ్రైవర్లు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు అన్యాయం జరుగుతోందని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజు మండిపడ్డారు. బుధవారం కుప్పం ఆర్టీసీ డిపో ప్రాంగణంలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. శాశ్వత ఉద్యోగులకు అందిస్తున్న వసతులను కల్పించాలని కోరారు. సమావేశంలో ఈయూ జిల్లా కార్యదర్శి కె.బలరామ్, కుప్పం డిపో అధ్యక్షుడు చెంగ్రాయప్ప, కార్యదర్శి కరుణాకరన్, విశ్వనాథ్, మురళీధర్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలి



జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులు

కుప్పంరూరల్: గ్రామీణ ప్రాంత విద్యార్థులు అంతర్జాతీయ స్థాయికి ఎదిగి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ కోరారు. బుధవారం కుప్పం మండలం టి.సదుమూరు ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి త్రోబాల్ జట్టు ఎంపిక జరిగింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి 250 మంది విద్యార్థులు హాజరు కాగా, ఇందులో 26 మంది జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం పద్మనాభరాజు తెలిపారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులను తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న లోకనాథం

బైరెడ్డిపల్లె: చదువులో వెనుకబడిన విద్యార్థులను మంచి మార్గంలో తీర్చిదిద్దాలని జిల్లా టీఏఆర్ఎల్ కో–ఆర్డినేటర్ లోకనాథం అన్నారు. బైరెడ్డిపల్లె బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ తరగతులను ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ చదువులో ప్రావీణ్యం చూపించే వారి కంటే చదువులో వెనుకబడిన వారిని గుర్తించి వారిని ప్రోత్సహించాలన్నారు. ఎంఈఓ సుబ్రమణ్యం, రిసోర్స్ పర్సన్స్ శశికుమార్, సురేఖ, చైతన్యాచారి పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యల పరిష్కారానికి కృషి



వెంకటేశ్వర్లను కలిసిన వీఆర్ఏల సంఘం నేతలు

రొంపిచెర్ల: వీఆర్ఏల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ఏపీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లకు చిత్తూరు జిల్లా వీఆర్ఏల సంఘం గౌరవాధ్యక్షుడు లక్ష్మణ్ బుధవారం వినతి పత్రం అందజేశారు. వీఆర్ఏల సమస్యల పరిష్కారం కోసం ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నామని, అర్హత కలిగిన వీఆర్ఏలకు ఉద్యోగోన్నతులు కల్పించి, జీతాలు పెంచేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్ఏలు ఇర్ఫాన్ అలీ, దామోదర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'దర్బార్'

శాంతిపురం : సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. బుధవారం స్థానిక ఐటీఐ ఆవరణలో చేపట్టిన అబకలదొడ్డి పంచాయతీ ప్రజాదర్బార్‌లో ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, పీడీ వికాస్ మర్మత్‌తో కలసి ఆయన పాల్గొన్నారు. ఆర్‌డీఓ శ్రీనివాసులు, ఎంపీడీఓ కుమార్, తహసీల్దార్ శివయ్య పాల్గొన్నారు.

రోడ్లు ఛిద్రం.. జర భద్రం

వి.కోట నుంచి కేజీఎఫ్ రహదారిలో గుంతలమయమైన అంత్రరాష్ట్ర రహదారి



గంగవరం సమీపంలోని మదనపల్లి హైవేలో గుంతలు



- వర్షాలతో అధ్వాన్నంగా మారిన రోడ్లు
- గ్రామాల్లోని వీధులు చిత్తడి చిత్తడి
- రోడ్లలో నీరు చేరి రాకపోకలకు ఇక్కట్లు
- గుంతలమయమైన రహదారులు

పలమనేరు: పలమనేరు, కుప్పం నియోజకవర్గంలో గతంలో దెబ్బతిన్న రహదారులు ఫెంగల్ తుపాను వర్షాల కారణంగా మరింత ఘోరంగా మారాయి. పలు రహదారుల్లో నీరు నిలిచిపోయి గుంతలమయమయ్యాయి. దీంతో ద్విచక్రవాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇక గ్రామాల్లో అయితే వీధుల్లోనే మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. ఆఖరుకు పలమనేరు మీదుగా వెళ్లే అనంతపూర్–క్రిష్ణగిరి హైవేలో సైతం పెద్దపెద్ద గుంతలు పడ్డాయి. హైవేలో వెళ్లే వాహనచోదకులు ఏమాత్రం చూడకుండా వెళ్లినా ప్రమాదాలు తప్పని పరిస్థితి ఏర్పడింది.

హైవేల పరిస్థితి సైతం అధ్వాన్నమే

పలమనేరు సమీపంలోని గంగవరం ఫ్లైఓవర్ వద్ద జంక్షన్‌లోనే పెద్ద గోతులు పడ్డాయి. ఇక్కడ వర్షపు నీరు భారీగా నిలిచింది. ఇక దీన్ని పక్కనే రోడ్డు దెబ్బతింది. పట్టణ సమీపంలోని నాగమంగళం వద్ద రోడ్డుపైనే వరదనీరు చేరింది. ఎప్పుడు వర్షాలు పడినా హైవేలో నిలిచిన నీటిని స్థానిక మున్సిపల్ అధికారులు మోటార్లతో బయటకు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదేమార్గంలోని కొలమాసనపల్లి వద్ద హైవేలో సైతం రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు దర్శనమిస్తున్నాయి.

గుంతలమయంగా గ్రామీణ రోడ్లు

పలమనేరు మండలంలోని కొలమాసనపల్లి పంచాయతీ ఎర్రగొండేల్లి–మాదిగబండ రహదారిలో రోడ్డుపై నాలుగు అడుగుల నీరు చేరి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. బైరెడ్డిపల్లి మండలంలోని కడపనత్తం రోడ్డు పూర్తిగా గుంతలమయమైంది. బైరెడ్డిపల్లి చెక్‌పోస్టు నుంచి పాతూరు, పాతపేట, కడపనత్తం ఐదు కిలోమీటర్లు వెళ్లాలంటే గంట సమయం పడుతోంది. ఈ మార్గంలో వందల సంఖ్యలో గుంతలుపడ్డాయి. ఈ మార్గంలో కనీసం ఆటోలు సైతం వెళ్లని పరిస్థితి నెలకొంది. పెద్దపంజాణి మండలంలోని చెన్నారెడ్డిపల్లి రోడ్డు వర్షాల కారణంగా బురదమయమైంది. ఈ మార్గంలో ద్విచక్రవాహనాల్లో వెళ్లే వాళ్ల టైర్లు స్కిడ్ అయి బురదలోనే పడుతున్నారు. కనీసం నడిచి వెళ్లాలన్నా వీలుకాని పరిస్థితి నెలకొంది. ఇక గంగవరం మండలం కీలపట్ల రోడ్డుతోపాటు వి.కోట మండలాల్లో 12 గ్రామాలకు వెళ్లే రహదారుల పరిస్థితి ఘోరంగా తయారైంది.



కుప్పం: గుంతలో పడి ప్రమాదానికి గురైన ద్విచక్రవాహనదారుడు



బైరెడ్డిపల్లి మండలంలో గుంతలమయమైన కడపనత్తం రహదారి

గ్రామాల్లో వీధులు రొచ్చురొచ్చు

ఇక నియోజకవర్గంలోని పలు మండలాల గ్రామాల్లో వీధులు రొచ్చుగా రొచ్చుగా మారాయి. వీధుల్లోని డ్రైన్స్ మొత్తం పూడిపోవడంతో మురుగునీరు వెళ్లడం లేదు. దీంతో ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు, వర్షానికి పడిన నీటితో వీధుల్లో నీరు నిలిచి చాలా అధ్వాన్నంగా మారాయి. నియోజకవర్గంలోని 90 పంచాయతీల్లో 90 గ్రామాల్లో ఇదే సమస్యలున్నట్టు గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు ఇలాంటి సమస్యలపై చొరవ చూపాల్సిన అవసరం ఉంది.

కుప్పంలో..

కుప్పం: పట్టణంలో కురుస్తున్న వర్షానికి రోడ్లంతా గుంతలమయం కావడంతో పాదచారులు, వాహనదారుల అవస్థలు వర్ణనాతీతం. ఫెంగల్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షానికి పట్టణం వర్షం నీటిలో నిండిపోయి బురదమయం కావడంతో ప్రయాణికుల రాకపోకలకు తీవ్రఇబ్బంది పడుతున్నారు. గుంతలు పడినా రోడ్డును పూడ్చకపోవడం పట్టణ వాసులకు ప్రమాదకరంగా మారింది, గుడుపల్లె, హెచ్‌పీ రోడ్డు, మున్సిపల్ కార్యాలయం ఎదుట, బాలుర ఉన్నత పాఠశాల వద్ద రోడ్డు అధ్వాన్నంగా తయారయ్యాయి. అలాగే నారాయణస్వామి వీధి, తపాల్‌రాజ్ వీధి కొత్తపేట ప్రాంతాల్లో గతంలో వేసిన రోడ్లు కంకర్ తేలి గుంతలు కావడంతో పట్టణ వాసులు నడవలేక ఇబ్బందులు పడుతున్నారు. వారం క్రితం డ్రైనేజీ కాలువ మరమ్మతుల కోసం పట్టణంలో కాలువ పనులు చేపట్టారు. సకాలంలో పూర్తిచేయకపోవడంతో వర్షాలకు ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. అధికారులు స్పందించి పట్టణంలోని రోడ్ల మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని ఇందులోభాగంగా పట్టణ వాసులు కోరుతున్నారు.



కుప్పంలో గుంతలమయమైన హెచ్‌పీ రోడ్డు

నేటి నుంచి జాతీయ గీతాలాపన

పుంగనూరు: పట్టణంలో ప్రతిరోజూ ఉదయం 8 గంటలకు జాతీయ గీతాలాపన కార్యక్రమాన్ని గురువారం నుంచి పునరుద్ధరిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆరు నెలల క్రితం పట్టణంలో జరిగిన విస్తరణ కార్యక్రమాల్లో ఈ కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపి వేశామన్నారు. కమిటీ, మున్సిపాలిటీ ఇక మీదట జాతీయ గీతాలాపనను కమిటీ, మున్సిపాలిటీ నిరంతరం కొనసాగిస్తుందని, పట్టణ ప్రజలు, వ్యాపారులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు యథావిధిగా రోజూ ఉదయం 8 గంటలకు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్‌సీపీ నేతకు తీవ్రగాయాలు

కుప్పంరూరల్: రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రవి తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్తుల కథనం మేరకు.. ఆవులనత్తం గ్రామానికి చెందిన రవి మంగళవారం కుప్పంలో పనులు ముగించుకుని రాత్రి బైక్‌లో ఇంటికి బయలుదేరాడు. పెద్దబంగారునత్తం వద్దకు చేరుకోగానే ముందు వెళ్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని ప్రమాదవశాత్తు ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రవి తీవ్రంగా గాయపడడంతో స్థానికులు హుటాహుటిన కుప్పంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు మెరుగైన వైద్యం కోసం బెంగళూరు మణిపాల్ ఆస్పత్రికి సిఫార్సు చేయడంతో అక్కడికి తరలించారు.

అధిక ధరకు సినిమా టికెట్ల అమ్మకాలపై ఫిర్యాదు

పలమనేరు: పట్టణంలోని కొన్ని సినిమాహాళ్ల యజమానులు సిండికేట్‌గా మారి పుష్ప–2 సినిమా టికెట్ ధరలను ఇష్టానుసారంగా అమ్ముతున్నారని ప్రేక్షకుల తరఫున పట్టణానికి చెందిన దిలీప్, మోహన్ బుధవారం స్థానిక ఆర్డీఓ భవానీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు విడుదల కానున్న పుష్ప–2 సినిమా టికెట్‌ను రూ.60కి అమ్మాల్సి ఉండగా ప్రభుత్వ జీఓ మేరకు టికెట్‌కు మరో వంద అదనంగా వసూలు చేయాలని చెప్పడంతో ఆ లెక్కన రూ.160 తొలిరోజు టికెట్లను విక్రయించాల్సి ఉందన్నారు. కానీ థియేటర్ల నిర్వాహకులు ఫ్యాన్స్ షో పేరిట రూ.800 దాకా టికెట్ అమ్ముతున్నారని, కానీ రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇక్కడ జరుగుతున్న దోపిడీపై ఆర్డీఓ స్థాయి అధికారులే నేరుగా తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

జిల్లా రెడ్ క్రాస్ కమిటీకి కల్లూరు హైస్కూలు ఎంపిక



మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు పాఠశాలను జిల్లా రెడ్ క్రాస్ కమిటీకి ఎంపిక చేసినట్లు ఆ సంస్థ సమన్వయకర్త వనపర్తి వెంకటసిద్దులు తెలిపారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్, అధ్యక్షులైన జాయింట్ కలెక్టర్ విద్యాధరి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా రెడ్ క్రాస్ కమిటీ సమావేశం నిర్వహించారు. కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జూనియర్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ సేవా కార్యక్రమాల గురించి సమన్వయకర్త వివరించారు. దీనితో ఆ స్కూల్‌ను జిల్లా కమిటీకి ఎంపిక చేసి వారిని జేసీ అభినందించారని హెచ్ఎం శ్రీవాణి తెలిపారు.

అండర్–17 త్రోబాల్ పోటీలకు ఎంపిక



అవినాష్, చందన

పుంగనూరు: జిల్లా స్థాయి అండర్–17 త్రోబాల్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. బుధవారం కుప్పం మండలం నడుమూరులో జరిగిన పోటీల్లో మండలంలోని చంద్రమాకులపల్లె హైస్కూల్ 10వ తరగతి విద్యార్థులు చందన, అవినాష్ త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యారని ఆ స్కూల్ హెచ్ఎం శ్రీదేవి తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ మురళి పాల్గొన్నారు.

త్రోబాల్ పోటీలకు చిన్నేపల్లె విద్యార్థి



నౌమన్ బాషా

పెద్దపంజాణి: మండలంలోని చిన్నేపల్లె జెడ్పీ హైస్కూల్(ఉర్దూ)లో 9వ తరగతి చదువుతున్న ఎస్ఎస్.నౌమన్ బాషా అండర్–17 బాలుర విభాగంలో చిత్తూరు జిల్లా త్రోబాల్ జట్టుకు ఎంపికైనట్లు హెచ్ఎం ముక్తార్‌అహ్మద్, పీడీ భవాని ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం కుప్పం మండలం టి.సదుమూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎంపికలో మంచి ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యాడని వారు పేర్కొన్నారు. డిసెంబర్ నెల చివరి వారంలో మంగళగిరిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థి పాల్గొంటాడని చెప్పారు. ఎస్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు నౌమన్‌ను అభినందించారు.

పంట నష్టం వివరాలు సేకరించండి

చౌడేపల్లె: తుపాను ప్రభావానికి కురిసిన నష్టాలు చోటుచేసుకున్న పంటల నష్టం వివరాలను రైతుల వారీగా సేకరించాలని వ్యవసాయశాఖ ఏడీఏ శివకుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని పెద్దకొండామర్రి, చింతమాకులపల్లె తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి పంటలను పరిశీలించారు. వర్షానికి దెబ్బతిన్న పంటలను రైతులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది జీపీఎస్ ట్యాగ్ చేసిన ఫొటోలతోపాటు పంట నష్టం వివరాలు సేకరించి నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. కార్యక్రమంలో ఏఓ జ్యోతమ్మ, అగ్రికల్చర్ అసిస్టెంట్ నవీన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

తమిళ బియ్యం పట్టివేత

కుప్పంరూరల్: వేర్వేరు చోట్ల నిర్వహించిన దాడుల్లో 1,500 కిలో తమిళ బియ్యం పట్టుకుని ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన వెలుగు చూసింది. బుధవారం కుప్పం సీఐ మల్లేష్ యాదవ్ కుప్పం మండలం కూసూరు గ్రామంలో దాడులు చేపట్టి అమ్మకానికి ఉంచిన 900 కిలోల తమిళ బియ్యం పట్టుకున్నారు. ఇందుకు కారణమైన కూసూరుకు చెందిన మాధమ్మ, రాజమ్మ, తీర్థగిరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.

6 నుంచి రెవెన్యూ గ్రామసభలు

రొంపిచెర్ల: మండలంలో ఈనెల 6 నుంచి 30వ తేదీ నిర్వహించనున్న రెవెన్యూ గ్రామసభలను రైతులు విజయవంతం చేయాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 6న బండకిందపల్లె, 10న పెద్దగొట్టిగల్లు, 16న బొమ్మయ్యగారిపల్లె, 19న చిచ్చిలివారిపల్లె, 20న పెద్దమల్లెల, 24న మోటుమల్లెల, 26న గానుగచింత, 28న రొంపిచెర్ల–1, 30న రొంపిచెర్ల–2 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్టు వివరించారు. భూసమస్యలను రైతులు గ్రామసభల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

చౌడేపల్లె: మండలంలో ఈనెల 6 నుంచి 30వ తేదీ వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ హనుమంతునాయక్ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లకు తహసీల్దార్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. 6న ఏ.కొత్తకోట, 7న దుర్గసముద్రం, 10న చారాల, 11న శెట్టిపేట, 12న పందిళ్లపల్లె, 13న చౌడేపల్లె, 17న గడ్డంవారిపల్లె, 18న కొండామర్రి, వెంగళపల్లె,19 అమినిగుంట, 20న దిగువపల్లె, 21న కాగతి, 24న కాటిపేరి, 26న లద్దిగం, 27న పుదిపట్ల, 28న చింతమాకులపల్లె, 30న పెద్దయల్లకుంట్ల గ్రామ సచివాలయాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు వివరించారు. సమస్యల పరిష్కారానికి రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సదుంలో..

సదుం: 6వ తేదీ నుంచి మండలంలో నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎస్ఎం. హుస్సేన్, డీటీ కుమార్ కోరారు.

మున్సిపల్ బకాయిల్లో రారాజులు

– అధికార పార్టీ నేత బకాయిలు రూ.22 లక్షలు

పుంగనూరు: మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరిస్తామని గొప్పలు చెప్పుకుంటూ పెద్దమనుషులుగా చలామణి అవుతున్న వారు తమ ఆస్తులకు పన్నులు మాత్రం ఏళ్ల తరబడి చెల్లించకపోవడం చర్చనీయాంశమవుతోంది. అధికార, ప్రతిపక్ష పార్టీల్లో పదవులున్న వారు మాత్రం ఏళ్ల తరబడి పన్నులు చెల్లించకపోయినా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి. అదే సామాన్యుల విషయంలో అయితే మాత్రం అధికారుల తీరు మరోలా ఉంటోంది. మున్సిపాలిటీలో అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్ రామకృష్ణంరాజు, ఆయన సోదరుడు నియోజకవర్గ తెలుగుదేశం నాయకుడు వెంకటరమణరాజు, వారి కుటుంబ సభ్యులకు చెందిన 18 ఆస్తులు పట్టణంలో ఉన్నాయి. వీరి కుటుంబ సభ్యులు రెండేళ్లుగా పన్నులు చెల్లించకపోవడంతో మున్సిపాలిటీకి రూ.22 లక్షల ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ జాగా పన్ను బకాయిలు పడ్డారు. అలాగే వ్యాపారులు జి.కృష్ణారెడ్డి రూ.4.90 లక్ష లు, గోకుల్ సర్కిల్‌లోని వెంకటేశ్వరలాడ్జి యజమాని మునెప్ప రూ.3.26 లక్షలు బకాయిలు పడ్డారు. సెంటర్ లాడ్జిలో వ్యాపారి కేఎం.నరసింహులు రూ.5.89 లక్షలు, కె.శివశంకర్‌రెడ్డి తాటిమాకులపాళెం రూ.4.18 లక్షలు, బి.సుశీలమ్మ కొత్తయిండ్లు రూ.3.72 లక్షలు, జమీందారులు రూ.3.38 లక్షలు, జి.రోహిత్‌రెడ్డి రూ. 3.25 లక్షలు, గోకుల్ యజమాని చిన్నప్పయ్య రూ. 3.24 లక్షలు, జి.మంజుల రూ.3.16 లక్షలు, జి.మౌనిక రూ.3 లక్షలు, పి.కేశవరెడ్డి రూ.1.96 లక్షలు, బీఏఆర్.మహమ్మదాలి రూ.1.57 లక్షలు, కె.నరేష్ రూ.1.53 లక్షలు బకాయిలు ఉన్నారు. అలాగే రూ.లక్ష లోపు పన్ను చెల్లించాల్సిన యజమానులు 34 మంది ఉన్నారు. రూ.లక్షకు పైగా పన్నులు చెల్లించాల్సిన యజమానులు 18 మంది ఉన్నారు. రూ.5 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు పన్ను చెల్లించాల్సిన వారు 15 మంది ఉన్నారు. వీరి బకాయిలు రూ.97.64 లక్షలు వసూలు కావాల్సి ఉంది. ఈ విషయమై కమిషనర్ మధుసూదన్‌రెడ్డిని సాక్షి వివరణ కోరగా బకాయిలు ఉన్నమాట వాస్తవమేనని, బకాయిదారులకు నోటీసులు జారీ చేశామని, తక్షణమే వసూలు చేస్తామన్నారు.

దివ్యాంగులకు మంచి 'భవిత'



రొంపిచెర్ల: దివ్యాంగులకు బహుమతులను ప్రదానం చేస్తున్న అధికారులు



గుడుపల్లె: దివ్యాంగ దినోత్సవంలో అధికారులు, దివ్యాంగులు

రొంపిచెర్ల: భవిత కేంద్రాల్లోనే దివ్యాంగులకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి అన్నారు. ప్రపంచ అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని భవిత కేంద్రంలో బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, 6 నుంచి 18 ఏళ్ల వరకు భవిత కేంద్రంలో చదువుకునే వారికి ప్రభుత్వం ఏటా రూ.3వేలు తల్లుల బ్యాంక్ ఖాతాలో రవాణా భత్యం కింద జమచేస్తుందని అన్నారు. భవిత కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఎంఈఓలు ఇందిర, శ్రీనివాసులు, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీదేవి, దివ్యాంగుల సంఘం నాయకులు ఇర్షాద్, సీఆర్‌పీలు అనసూయ, కిరణ్, రాజేంద్ర, సహిత విద్య ఉపాధ్యాయులు అములు, మానస, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ హేమలత, పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పులిచెర్లలో..

పులిచెర్ల(కల్లూరు): అంతర్జాతీయ ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవాన్ని పులిచెర్ల ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఎంఈఓలు సిద్ధరామయ్య, తాతయ్య మాట్లాడారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సర్పంచ్ రాణెమ్మ, హెచ్ఎం రామచంద్రారెడ్డి, సిబ్బంది బావాజి, వేణుగోపాల్, మునీర్, మునీశ్వర, గోవర్ధన్ పాల్గొన్నారు.

వైకల్యం శరీరానికి మాత్రమే..

సదుం: అంగవైకల్యం శరీరానికి మాత్రమే..మనసుకు కాదని ఎంఈఓ–2 దామోదర అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో భవిత కేంద్రం ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్రత్యేక అవసరాల పిల్లల దినోత్సవం నిర్వహించారు. భవిత కేంద్రాల్లో ఇచ్చే ఫిజియో, స్పీచ్ థెరపీ, అలవెన్సుల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. హెచ్ఎం శ్రీరాముల నాయక్, సహిత ఉపాధ్యాయులు విశ్వనాథ, మమత, గౌసియా, సీఆర్పీ అంజమ్మ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

బైరెడ్డిపల్లె: దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని ఎంఈఓలు వేణుగోపాల్‌రెడ్డి, సుబ్రమణ్యం అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బైరెడ్డిపల్లె భవిత కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దివ్యాంగులను సాధారణ మనుషులతో సమానంగా ప్రతిఒక్కరూ చూడాలన్నారు. దివ్యాంగులను ఉన్నత స్థాయికి తీసుకొచ్చేందుకు తల్లితండ్రులు, భవిత కేంద్రం ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఆటలు, పాటలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. హెచ్ఎం నసీబ్‌జాన్, చంద్రప్రకాష్, ఫిజియోథెరపిస్ట్ రాజు, ఐఈఆర్‌టీ నిర్మల పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: స్థానిక భవిత కేంద్రంలో బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఎంపీడీఓ లీలామాధవి, ఎంఈఓ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. దివ్యాంగులను అన్ని విధాలా ఆదుకుంటున్నట్టు చెప్పారు. అనంతరం బహుమతులు పంపిణీ చేశారు. ఐఈఆర్‌పీలు వెంకట్రమణ, అరుణ, న్యాయవాది వీర మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

గుడుపల్లె : స్థానిక ఎమ్మార్సీ భవనంలో బుధవారం ఘనంగా దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఎంపీడీఓ రాధాకృష్ణన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలన్నీ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు పక్కాగా చేరాలని స్పష్టం చేశారు. అనంతరం దివ్యాంగ పిల్లలకు వివిధ పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా విజేతలకు వక్కలిగర సంఘం అధ్యక్షుడు రాజగోపాల్ బహుమతులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎంఈఓలు శ్రీదేవి, లక్ష్మయ్య, స్థానిక నేతలు టీఎం బాబునాయుడు, హేమాంబరగౌడ్ పాల్గొన్నారు.



పులిచెర్ల: బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఈఓలు



సదుంలో..



బైరెడ్డిపల్లెలో..

వర్షాలకు స్తంభించిన రాకపోకలు

- రోడ్డుపై ఐదు అడుగుల లోతు నిలిచిన నీళ్లు
- జేసీబీతో కాలువలు తీసి నీటిని మళ్లించిన తహసీల్దార్
- రాకపోకలు పునరుద్ధరణ



శ్రీనాథపురం కాలనీ సమీపంలో జేసీబీతో నీటిని మళ్లిస్తున్న తహసీల్దార్ కిరణ్‌కుమార్

రొంపిచెర్ల: ఫెంగల్ తుపాను ప్రభావంతో మండలంలో కురిసిన వర్షాలకు పెద్దగొట్టిగల్లు గ్రామ పంచాయతీలో రెండు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. పెద్దగొట్టిగల్లు, బండకిందపల్లె గ్రామాల సరిహద్దులోని బండబల్ల వంకలో సాగునీటి ప్రాజెక్టును నిర్మించారు. దీంతో శ్రీనాథపురం కాలనీ, రామిరెడ్డిగారిపల్లె గ్రామాలకు వెళ్లే రోడ్డు మీద 5 అడుగుల లోతు నీళ్లు నిలిచిపోయాయి. గ్రామస్తులు తహసీల్దార్ కిరణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు. బుధవారం ఉదయం జేసీబీతో కాలువలు తీసి నీటిని మళ్లించారు. దీంతో రెండు గ్రామాల ప్రజలు వాహన రాకపోకలను యథావిధిగా కొనసాగించారు.